ఆహ్లాదం.. ఆనందం

నాడు కళావిహీనం.. నేడు కళాశోభితం... గడిచిన నాలుగేళ్లలో పార్కుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేయడంతో పిల్లలు, పెద్దలు, వాకర్స్, సీనియర్ సిటిజన్స్ ప్రశాంతంగా సేద తీరేందుకు బహు సుందరంగా ముస్తాబయ్యాయి. అహ్లాదాన్ని పంచడంతోపాటు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకూ దోహదపడుతున్నాయని సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు పార్కులను పట్టించుకోకపోవడంతో తుప్పలు పెరిగి నిరుపయోగంగా మిగిలిపోయాయి. కొన్నిచోట్ల మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయి... సామాన్య ప్రజలు అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొనేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో కీలక పర్యాటక ప్రాంతాలతోపాటు కాలనీల్లోని పార్కులన్నీ అభివృద్ధికి నోచుకున్నాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- కోట్లాది రూపాయలతో పార్కుల అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న వాకర్స్, పిల్లలు, పెద్దలు


జమ్మిచెరువు పార్కులో పిల్లల ఆటల సామగ్రి



కొమ్మాది/భీమునిపట్నం : బిజీ లైఫ్‌లో సాయంత్రం వేళ ప్రశాంత వాతావరణంలో సేద తీరాలనుకునే వారిని నందనవనాన్ని తలపిస్తున్న పార్కులు స్వాగతిస్తున్నాయి. పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన చిన్నారులను ఆహ్వానిస్తూ ఎన్నో ఆట పరికరాలు ఏర్పాటయ్యాయి. ఆహ్లాదకర వాతావరణంలో నడిచివద్దాం అనుకునే వారి కోసం వాకింగ్ ట్రాక్‌లు సిద్ధమయ్యాయి. అన్ని వర్గాల ప్రజలనూ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో పార్కుల్లో ఆనందంగా గడుపుతున్నారు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో పాడైపోయిన బీచ్ పార్కును అప్పటి టీడీపీ ప్రభుత్వం అలాగే వదిలేయడంతో... వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆధునికీకరించారు. ప్రత్యేకంగా రూ.20 లక్షలు కేటాయించి పార్కులోని పాత బొమ్మలకు రంగులు వేయడంతోపాటు కొత్తవి ఏర్పాటు చేసి, భారీగా మొక్కలు నాటారు. సమీపంలోని పొట్టి శ్రీరాములు పార్కును రూ.15 లక్షలతో అభివృద్ధి చేశారు. దాని దగ్గరలోని అల్లూరి సీతారామరాజు పార్కు, పక్కనే వున్న ఫౌంటెయిన్‌ను అందంగా తీర్చిదిద్దారు. భీమిలి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో సన్ రే రిసార్ట్స్ సహకారంతో ఏర్పాటు చేసిన కొబ్బరిచెట్ల పార్కు ప్రత్యేక ఆకర్షణగా ఉంది. తగరపువలస రోడ్డులోని జమ్మిచెరువు పార్కులో రూ.82 లక్షలతో ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కు చుట్టూ రక్షణ గోడ, పిల్లలు ఆడుకునే సామగ్రి, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. లైట్లు, రెయిన్‌షెల్టర్లు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాల కల్పనకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సాగర్‌నగర్ ప్రాంతం గతంలో కళావిహీనంగా వుండగా ప్రస్తుతం కొబ్బరి చెట్ల పార్కుతో సుందరీకరించి అభివృద్ధి చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బీచ్‌పార్కులో ఆకట్టుకుంటున్న బొమ్మలు


భీమిలి బీచ్ రోడ్డులో ఆకట్టుకుంటున్న ఫౌంటెయిన్


సాగరతీరంలో సుందరంగా..


8వ వార్డులో నిర్మిస్తున్న థీమ్ పార్కు

నాలుగేళ్లలో బహుసుందరంగా...

రూ.46.15 లక్షలతో
జీవీఎంసీ 5వ వార్డులో నాలుగు పార్కులు సుందరీకరించారు.

రూ.6.14కోట్లతో
జీవీఎంసీ 6వ వార్డులో 6 పార్కులు అద్భుతంగా తీర్చిదిద్దారు.

రూ.93 లక్షలతో
జీవీఎంసీ 7వ వార్డులో 6 పార్కులు అభివృద్ధి చేశారు.

రూ.2.25 కోట్లతో
జీవీఎంసీ 6వ వార్డులో 8 పార్కులు సకల వసతులతో సుందరంగా తీర్చిదిద్దారు.

రూ.1.30 కోట్లతో
ఎండాడ వైఎల్‌పీ లే అవుట్‌లో థీమ్ పార్కు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

గతంలో అభివృద్ధి చేయలేదు



గతంలో ఏ ప్రభుత్వమూ చేయనంతగా పార్కుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారు. ఇది అందరూ హర్షించదగిన విషయం. మాలాంటి సీనియర్ సిటిజన్స్‌కు ఆహ్లాదంతోపాటు ఆనందం కలిగించే పార్కులను ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం.

– ఎం.గోవిందరావు, సాగర్‌నగర్

అద్భుతంగా తీర్చిదిద్దారు



ప్రస్తుత ప్రభుత్వం పార్కులను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దింది. ఇంతకు ముందు కనీస సదుపాయాలు లేకపోవడంతో అటువైపు వెళ్లలేకపోయేవాళ్లం. ప్రస్తుతం పిల్లలు, పెద్దలు ఆనందించే విధంగా పార్కులు అభివృద్ధి చేశారు. జమ్మిచెరువు పార్కులో విశాలమైన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం సంతోషకరం.

– నమ్మి శేషాద్రియాదవ్, భీమిలి

క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు


చందన అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

భీమునిపట్నం: స్థానిక కృష్ణా కాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామికి గురువారం కార్తీక ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవారి విగ్రహాన్ని చందనంతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సభ్యులు కె.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ

ఆనందపురం : స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న గణిత ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. విద్యార్థుల నుంచి ఆశించిన అభ్యసన ఫలితాలు రాబట్టడం, రీడింగ్, రైటింగ్, అర్థమేటిక్‌లో క్షుణ్ణంగా తర్ఫీదు ఇవ్వడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు కేజియా, కె.శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఎస్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పద్మనాభం: అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని నేరెళ్లవలసలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల ఫ్లెక్సీని, పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో తునివలస ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు రేవళ్ల సత్యనారాయణ, ఈవోఆర్డీ కుమార్, గ్రామ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు

పద్మనాభం: మండలంలోని వెంకటాపురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్యాసింజర్ ఆటో బోల్తా


వెంకటేశ్వరమెట్ట వద్ద డివైడర్‌పై బోల్తా పడిన ఆటో

తగరపువలస: జాతీయ రహదారిపై వెంకటేశ్వరమెట్ట వద్ద గురువారం సాయంత్రం ప్యాసింజర్ ఆటో బోల్తా పడి డివైడర్‌పైకి చేరుకుంది. తగరపువలస నుంచి విజయనగరం వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని ఆటో డ్రైవర్ చెపుతుండగా, వేగంగా వెళ్తున్న ఆటో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతోనే ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ చెప్పినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద సమయంలో ఆటోలో డ్రైవర్ మాత్రమే ఉండడంతో క్షేమంగా బయటపడినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

'పోలమాంబ' ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

భీమునిపట్నం: భీమిలిలోని మత్స్యకారుల ఆరాధ్య దైవం శ్రీ పోలమాంబ అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఈ నెల 26 నుంచి 29 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు రావాల్సిందిగా ఎమ్మెల్యేను గ్రామపెద్దలు ఆహ్వానించారు. సేవా సంఘ అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, ముఖ్య సభ్యులు అల్లిపిల్లి అప్పారావు, వాసుపల్లి ఎల్లాజీ, కారి చిన్నారావు, ఉమ్మిడి మహేష్, వాసుపల్లి వంశీ పాల్గొన్నారు.

వంద శాతం జీఈఆర్ లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: పద్మనాభం మండలంలో వంద శాతం జీఈఆర్ (స్థూల నమోదు నిష్పత్తి) సాధించాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ అన్నారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో గురువారం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఈఆర్ సాధనలో జిల్లాలో పద్మనాభం మండలం ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ఎంఈవోలు మాట్లాడుతూ పద్మనాభం మండలంలో జీఈఆర్‌లో ఉన్న 506 మంది పిల్లలు పాఠశాలల్లో చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని సూచించారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీవో అప్పలనాయుడు, ఏఎస్‌వో గీత మాట్లాడుతూ జీఈఆర్ సాధనకు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌ఎంటీలు కలిసి పని చేయాలని సూచించారు.

మధురవాడ బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా నరసింహ మూర్తి

పీఎం పాలెం : మధురవాడ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా రేజేటి నరసింహమూర్తి ఎన్నికయ్యారు. గత పాలకవర్గం గడువు తీరడంతో గురువారం ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా చామర్తి శ్రీధరాచార్యులు, నిష్ఠల శ్రీరామ మూర్తి, గౌరవ సలహాదారులుగా పట్నాల హరిప్రసాద్, రేజేటి గురనాథ శర్మ, కార్యదర్శిగా కాళిదాసు, ఉపాధ్యక్షునిగా వేమకోటి అనంత పద్మనాభం, ఉప కార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా వెంకట శివ ప్రసాద్, పాలక మండలి సభ్యులు ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయం లేదు


శింగనబందలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


చిట్టివలసలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న మహేష్, తదితరులు

తగరపువలస: ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం గురువారం భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చి చంద్రబాబు, పవన్ చెప్పే కల్లబొల్లి కబుర్లు నమ్మవద్దన్నారు. ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారం ప్రజలే తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు లచ్చుబుగత జగదీశ్వరరావు, చెల్లూరి నగేష్, మద్దిల వెంకటరమణ, పోట్నూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస వార్డు సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, జీరు సుజాత, పందిరి విజయ్, దల్లి అప్పలరెడ్డి, నీలాపు రామిరెడ్డి, వెంపాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలన అవినీతిమయం

ఆనందపురం : భావితరాల భవిష్యత్తు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మండలంలోని మామిడిలోవలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో జరిగిన అవినీతి, మోస పూరిత వాగ్దానాలతో కూడిన కర పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి ప్రజాభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి, సంక్షేమ పథకాలతో కూడిన ఫ్లెక్సీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కాకర్లపూడి వరహాలరాజు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను మాజీ ఎంపీటీసీ సభ్యుడు బలిరెడ్డి మహేష్, నాయకులు డోల దేవుడు, బొట్ట రామకృష్ణ, లెంక రాంబాబు, చందక అప్పలస్వామి, బంటు చిన్న, ఆనంద్, శిణగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి వెంకటాపురం, చీమల వెంకటాపురంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో స్వప్రయోజనాల కోసమే పథకాలు అమలు జరపడంతో నిజమైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిధులు ఖర్చయ్యాయి తప్ప ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు అలాగే ఉండిపోయాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తూ అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. సచివాలయ వ్యవస్థతో స్థానికంగా అన్ని సేవలు, అర్హతే ప్రామాణికంగా అందుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే సీఎంగా చేసుకుంటే ప్రజలకు బంగారు భవిష్యత్తు అందిస్తారన్నారు. ఓట్ల కోసం వచ్చే దోపిడీదారులు, సినిమా నటుల మాటలు నమ్మవద్దని చెప్పారు. ఈ సందర్భంగా చీమలమెట్టపాలెం గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, నాయకులు ఇల్లపు వెంకటరావు, గంటా అప్పలరాజు, బంటుబిల్లి సూరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు టోకరా

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు వెలంపేటలో నివసిస్తున్న వృద్ధ దంపతులు కానూరి అప్పారావు, ఆదిలక్ష్మి ఇంటికి బుధవారం సాయంత్రం ఇద్దరు అగంతకులు వచ్చి మూడు తులాల బంగారు తాడును అపహరించుకుపోయారు. దంపతులకు చెందిన ఇంటిలో అద్దెకు దిగుతామంటూ 35 ఏళ్లకు పైగా వయసు గల ఓ పురుషుడు, స్త్రీ సాయంత్రం 7.30 గంటలకు వచ్చారు. గురువారం మంచి రోజని, పాలు పొంగిస్తామని నమ్మించి రాత్రి 10 గంటల వరకు వృద్ధులతో వారి ఇంట్లో ఉన్నారు. అడ్వాన్స్ చెల్లిస్తామని, తమ వాళ్లు తీసుకొస్తున్నారని రెండున్నర గంటలపాటు కాలక్షేపం చేశారు. చివరకు ఆదిలక్ష్మి మెడలో నుంచి బలవంతంగా బంగారుతాడును తొలగించి తీసుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశేషంగా ఏకాదశి పూజలు

కొమ్మాది: కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకుని గురువారం పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రుషికొండలో గల శ్రీవారి ఆలయానికి, ఎండాడ, సాగర్‌నగర్, రుషికొండ, బీచ్‌రోడ్డు రామాద్రి శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి సమీపంలోని శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరి శంకర మఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవాలు


చిట్టివలసలో సాయివ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవాలు గురువారం చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం సుప్రభాతం, నగర సంకీర్తన, పాలాభిషేకం, సత్యసాయి వ్రతాలు, పల్లకీ ఉత్సవం, అన్నసమారాధన నిర్వహించారు. సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, పూర్వ కన్వీనర్ ఆర్.చంద్రరావు, వివిధ విభాగాల కో ఆర్డినేటర్లు టీవీఆర్ బాబా, సంతోష్, సత్యసాయి, ప్రసాద్, త్రివేణి, సీత, దివాకర్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, గుజ్జు సూరిబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక సత్యసాయి మందిరంలో సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు సత్యసాయి వ్రతాలు గురువారం ఆచరించారు. మధ్యాహ్నం ప్రసాదం పంపిణీ చేశారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు


సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

తగరపువలస: కార్తీకమాస శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక కొండపై గల శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయం, మెట్ల మార్గం భక్తులతో కిక్కిరిసిపోయింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భక్తులు కొండపైకి పోటెత్తారు. గురువారం వేకువజాము నుంచి ఆలయం వెనుక భాగంలోని మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. అర్చకులు ఏడిద వివేకానందశర్మ, కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ తరపున సరగడ నాగిరెడ్డి, మద్ది మహలక్ష్మి, తెడ్లాపు అప్పలరాజు, గుజ్జు సూరిబాబు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

పద్మనాభం: మద్ది గ్రామంలోని సాధు మఠం ఆశ్రమంలో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తులసి లక్ష్మి, సర్పంచ్ బుగత సన్యామ్మ, సత్యనారాయణ, తదితరులు వ్రతాలు ఆచరించారు. సామవేదం బదిరికా వాసు, బాల సుబ్రహ్మణ్యం, సీతారామయ్య పూజలు చేయించారు.

టీ - 20 మ్యాచ్‌కు పటిష్ట పోలీస్ బందోబస్తు


క్రికెట్ స్టేడియం వెలుపల అభిమానులు

పీఎం పాలెం : భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య బుధవారం రాత్రి జరిగిన టీ – 20 క్రికెట్ మాచ్‌ను పురస్కరించుకుని గతంలో ఎన్నడూ లేనివిధంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి, స్టేడియానికి మధ్యలో, సర్వీసు రోడ్డుకు, స్టేడియానికి మధ్యలో ఎత్తైన బారికేడ్లు ఏర్పాటు చేశారు. మ్యాచ్ చూసేందుకు టికెట్లతో వచ్చిన ప్రేక్షకులను మాత్రమే లోపలకు అనుమతించేలా క్లస్టర్ల వారీగా క్యూ ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నివాసులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నారు. మ్యాచ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు పోలీసులు తీసుకున్నారు.